మధ్య తరగతి మందహాసం

ఎక్విటెన్స్‌రోల్‌లో సంతకం చేస్తోంటే చేతులు వణికాయి. అప్రయత్నంగా కళ్లు చెమ్మగిల్లాయి. గుండె బరువెక్కింది. జీతం అందుకుంటూ వుంటే పెన్నిధి నుంచి చివర చివర అందుకుంటున్నట్లుగా ఉంది.

'ఇంకో నెల అంతే!' వెంపంగా వెలిగింది చిరునవ్వు.

హెడ్మాష్టరుగారు నవ్వేరు. 'మీరు అక్టోబరులో పుట్టి ఉంటే ఈ సంవత్సరమంతా పనిచేసి జూన్‌లో రిటైరయ్యేవారు!' అన్నారు.

గడ్డిపోచ కదలాడినట్టుగా నవ్వేడు సీతారామయ్య. "ముఖ్యమంత్రిగారే దయతలచి వుండకపోయి వుంటే మూడేళ్లనాడే రిటైర్ అయ్యేవాడిని కదా! ఎక్కడికెంత ప్రాప్తమో అంతే! ఆశపడితే వస్తుందా!"

హెడ్మాస్టరుగారింకేమీ అనలేదు. కానీ స్టాఫ్ మాత్రం సీతారామయ్యగారి వంటి ఉత్తమ ఉపాధ్యాయుడు, శిష్య వాత్సల్యం కలవాడూ, ఆదర్శజీవి రిటైర్ కాబోతున్నందుకు ఎంతగానో విచారాన్ని వ్యక్తపరిచారు. సెప్టెంబరంతా పనిచేసి ఆఖర్లో రిటైరు కాబోతున్నాడు ఆయన.

జీతం తీసుకుని మెల్లగా యింటి ముఖం పట్టారు సీతారామయ్యగారు. ఆయన మనస్సులో ఆలోచనలు శ్రావణ మేఘాల్లా కమ్ముకుంటున్నాయి. భయాలు పొట్లగిత్తల్లా కుమ్ముకుంటున్నాయి.

ఇంటికి రాగానే పెద్ద కోడలికి జీతం అందించాడాయన.

'ఇంకో నెల....' అంతేనా అన్నట్టుగా చూసింది సీత.

దాదాపు నలభయి సంవత్సరాలుగా నెల నెలా జీతం యిస్తూ యిలాటి చూపుల్ని ఎన్నో ఎదుర్కొన్నాడు ఆయన. తొలి తొలినాళ్లలో ఎంతో గర్వం, ఎంతెంతో ఆనందం, పస్టు వీక్‌లో జీతం యిచ్చే రోజున గొప్ప తృప్తి.

పెళ్లయింది...తొలిసారి భార్య చేతికి జీతం యిచ్చిన రోజు యిప్పటికీ గుర్తే.... ఆమె ముఖంలో విదియనాటి చంద్రరేఖ లాటి చిరునవ్వు యీనాటికీ తను మాసిపోయినా మాసిపోని వెలుగు రేఖ.

పిల్లలు ఒక్కొక్కరే పుట్టుకొచ్చే కొద్దీ, పెరిగిన సంసారంతో పాటుగా పెరుగుతూ వచ్చిన ఖర్చులు... చిక్కులు... యిబ్బందులు వాటితో సమానంగా పెరగలేని జీతం గురించి

జీవితంలో నిత్య సంగ్రామం... ఆలోచనలు... ఆరాటాలు.

ఏళ్లు గడిచేకొద్దీ పిల్లలకి వయస్సు పెరిగి అవసరాలు పెరిగి, వాటితో పాటు పెరగని ఆదాయంతో పోరాటం వల్ల పెరిగిపోయిన దిగుళ్లు... మనస్సులో ఎప్పుడూ ఆర్థిక సంబంధమయిన ఎగుడు దిగుళ్లు.

భార్య అనారోగ్యం... ఏటేటా కాన్పులతో తరిగిన శరీరంతో పాటుగా అటుగా పెరుగుతూ వస్తోన్న అనారోగ్యం... వైద్యానికి చిక్కులు... డాక్టర్లకి, మందులకి అందించగలిగినంత చాలనంత జీతం... ఆఖరికి భార్యని- తన ప్రాణంలో ప్రాణాన్ని - తన శరీరంలోని జీవాన్ని - తన జీవితాన్ని వెలిగించిన దీపాన్ని, తన కంటి వెలుగుని యింటి దీపాన్ని - తన కలల చెలిని - ఆ అనారోగ్యానికే బలివేశాడు...

'పెన్షన్ రావాలంటే చాలా కాలం పడుతుందేమో ?'

నిట్టూర్చాడు సీతారామయ్య. తలూపేడు సమాధానంగా. పెద్ద కోడలు అదోలా చూసి వెళ్లిపోయింది.

తన రిటయిర్‌మెంట్, తన పెన్షన్, తన పి.ఎఫ్. ఈ విషయాలు తలుచుకోవటం యిష్టం లేదు ఆయనకి. కొన్ని కొన్ని విషయాలను తలచుకోవటం, తలచుకోకుండా వుండటమే మంచిది. అంత వల్ల సుఖం లేకపోగా మనస్సుకి బాధ.

'టీ!' అందించింది రెండో కోడలు అరవింద. అలవాటుగా తాగేశాడు ఆయన. 'ఇది మానేస్తే పంచదార, పాలు, టీ ఖర్చు సగానికి సగం తగ్గుతాయి. ధరలు పెరిగితే మధ్య తరగతి మనిషి చేసే నిర్బంధ పొదుపు. ఆదాయం తగ్గితే సామాన్యుడు చేయవలసిన విధిలేని పొదుపు అంతే!' అనుకున్నాడు.

అంతలో మూడవ కోడలు అరుణ చేతి సంచులు తెచ్చి యిచ్చింది. పెద్ద కోడలు సీత డబ్బు, సరుకుల పట్టీ అందిస్తే జేబులో వేసుకున్నారు. ఇన్నేళ్లుగా ఆయనే యింటికి సరుకులు తెస్తారు. సీత పట్టీ రాస్తుంది. ఇద్దరూ కలిసి నెల నెలా బడ్జెట్ తయారు చేసుకుంటారు.

ఈసారి మాత్రం బడ్జెట్ తనే తయారు చేసింది. మామగారిని సంప్రదించలేదు. వచ్చే ఒకటవ తేదీ నుంచి తగ్గబోయే ఆదాకి తగ్గట్టుగా బడ్జెట్‌లో కోత యిప్పటి నుంచే ప్రారంభించింది ఆమె. కొట్టుకు వెళ్లాక మామగారే చూసుకుంటార్లే అన్నట్టుగా వెళ్లిపోయిందామె పుస్తకం అందించాక.

పచారీ కొట్టుకు బయలుదేరాడు సీతారామయ్య.

ఆయనకి ఆరుగురు కొడుకులు. ఆరుగురు కూతుళ్లు. పెద్ద సంసారం. ఉప్పుకీ, పప్పుకీ అప్పు కోసం వెళ్లకుండా, రిబ్బన్లనీ, సబ్బులనీ, పౌడర్లనీ డబ్బు వ్యర్థం చేయకుండా, చీరలనీ, సారెలనీ, సినిమాలకనీ, షికార్లనీ, వేధించకుండా గుంభనగా లాక్కొచ్చింది సంసారాన్ని. శారదని అందుకు మెచ్చుకోవాలి. అభినందించాలి. ఆమె తర్వాత యిప్పుడు కోడలు సీత.

కూతుళ్లందరికీ గంతకు తగ్గ బొంత అన్నట్టుగా తగిన సంబంధాలే చేశాడు. కట్నాలు అడక్కుండా కన్యాధనమే ధనం అనుకునే యోగ్యులని వెతికి వాళ్లకిచ్చి చేశాడు అన్ని పెళ్లిళ్లూ!

కొడుకులకి అందరికీ యథాశక్తి చదువు చెప్పించాడు. పెద్దవాడు నారాయణ బి.ఏ. కాటన్ మిల్స్‌లో ఉద్యోగం. రెండోవాడు ఎం.ఏ. చేశాడు. అయినా లెక్చరర్ ఉద్యోగం రాలేదు. స్థానికంగా ఉండిపోవాలని ఫ్యాక్టరీలో చేరాడు. మూడోవాడు బి.కాం. ఒక రైసు మిల్లులో మేనేజరు. నాలుగోవాడు బి.ఏ. బి.ఇడి. అయినా ఉద్యోగాల తిమింగలం వేటలో చిక్కుకుని ప్రయివేట్ స్కూల్లో పనిచేస్తున్నాడు రెండొందలకి. ఆఖరి యిద్దరూ కవలలు. ప్రయివేట్‌గా ఎం.ఏ. చేసుకుంటూ అక్కడా ఇక్కడా ప్రయివేట్ కంపెనీల్లో ఉద్యోగాలు వెలగబెడుతోన్నారు.

ఎవరికేం కొరత లేదా? అంటే లేదు. వుందా అంటే వున్నాయి. ఎక్కడికి తృప్తి. గుమాస్తాగా ఉద్యోగంలో చేరితే ఆఫీసరు పోస్టుమీదే వుంటుంది కన్ను. అన్నిటా అంతే.

మెల్లగా నడుస్తూన్నారు ఆయన.

ఆలోచనలు వెంటాడుతోనే వున్నాయి.

కొడుకులకి ప్రభుత్వ ఉద్యోగాలు రాలేదని అసంతృప్తి, కోడళ్లకు నగలు, చీరలు లేవని అసంతృప్తి. ఉమ్మడిగా కాకుండా ఎవరి కుండలో వాళ్లు ఉడకేసుకోవటం లేదని వాళ్లలో బయటకు రాని గొప్ప అసంతృప్తి.

తనేం చేయగలడు ?

మంచం ఉన్నంతవరకే కాళ్లు చాపుకునే మనస్తత్వం తనది. కొడుకులు కలెక్టరనీ, డాక్టరనీ, ఎడ్వొకేట్ అనీ, ఇంజనీర్ అని, లెక్చరర్ అనీ, ఆఫీసరనీ తను కలలు కనలేదు ఏనాడూ! కానీ వాళ్లూ బాగుండాలని ఆశించాడు అంతే!

"తనది మధ్యతరగతి మందహాసం!"

దీనికి కాంతి లేదు. తళుకు లేదు. పేరుకి మాత్రం చిరునవ్వు! జీవం, వెలుగులు లేని నవ్వు.

'నమస్కారం మాస్టారూ!'

ఆలోచనలు తెగాయి, స్విచ్ నొక్కగానే చీకట్లు పారిపోయినట్లు.

ఎదురుగా విశ్వం!

ఒకప్పటి తన విద్యార్థి. తన మిత్రుడు రాము కుమారుడు. ఉద్యోగాల రీత్యా ఊళ్లు పట్టి పోయాడు. ఏమిటీ జీవితాలు! స్నేహాలకి కూడా బంధాలుంటాయా? అవీ సడలి పోతాయా? కాలం, దూరం పరిస్థితులు స్నేహంపై కూడా ప్రభావాన్ని చూపుతాయా! స్నేహం వాటికి అతీతం కాదా!

విశ్వాన్ని చూడగానే ఆయన గుండెల్లో జాలి కదలాడింది. "విశ్వం! రాము పోయాడట కదా! ఏమైంది! జబ్బుగా ఉండిందా! నాకు చాలా రోజులకి తెలిసింది. వద్దామనుకుంటే తీరనే లేదు. ఎక్కడ చెప్పు. అన్నీ యిక్కట్లే... అమ్మగారు ఎలా వున్నారు!"

అన్నపూర్ణకి రాము అంటే పంచప్రాణాలు! భర్తని అంతగా ప్రేమించే వాళ్లు యీ రోజుల్లో ఎక్కడున్నారు?

విశ్వం ముఖంలో విషాదం కమ్ముకుంది. కళ్లల్లో నీళ్లు తిరిగాయి. మేఘం చల్లగాలికి కరిగిపోయినట్టుగా మనసూ ప్రేమకే, ఆత్మీయతకే ద్రవిస్తుంది.

"నాన్నగారు పోయి నెల తిరక్కముందే అమ్మ కూడా వెళ్లిపోయింది. ఆయన హార్ట్ ఎటాక్‌తో పోయారు. ఆఫీసు నుంచి వచ్చి రీడింగ్ రూంకి వెళ్లి పేపరు చదువుతూ చదువుతూ పడిపోయారు. హాస్పిటల్‌కి రీడింగ్‌రూం సెక్రటరీయే కార్లో తీసికెళ్లాడు. హాస్పిటల్‌కి వెళ్లకముందే ప్రాణం పోయింది. అమ్మగారూ అంతే! పడుకున్నది పడుకున్నట్టుగా వెళ్లిపోయింది!"

'అయ్యో పాపం! ఎంత ఘోరం జరిగింది' సీతారామయ్య నోటమాట పెగల్లేదు. ఆయన గుండెల్లో దేవినట్లయ్యింది. ఒక యింట్లో నెల తిరగకుండానే తల్లిదండ్రులు పోతే ఆ సంసారం గతేమిటి కావాలి ? పిల్లలు పెద్దవాళ్లే అయి వుండొచ్చు. అయితేనేం! ప్రపంచంలో నెగుకురావటం ఎంత కష్టం! అందునా సానుభూతి, స్నేహం, అభిమానం, దయ క్రమంగా క్షీణించే యీ రోజుల్లో.

మాస్టారుగారి వెంట నడుస్తూ వచ్చాడు విశ్వం.

'ఎలా వేస్తున్నారు మరి!' మధ్యతరగతి జీవనాడి తెలిసిన సీతారామయ్య అడిగాడు. విశ్వం వాళ్లు ముగ్గురన్నదమ్ములు. ముగ్గురూ బి.ఏ. చదువుకున్నారు. ఒకడు ఈ మధ్యే ఎమ్మే కూడా చేశాడు, అయినా ఉద్యోగాలు ఎక్కడున్నాయి.

"నాన్నగారు పోయాక మా రెండో తమ్ముడు శివరాంకి అదే డిపార్ట్‌మెంట్‌లో ఎల్‌డీసీగా ఉద్యోగం ఇచ్చారు వాడికి ఏజ్ బార్ కాలేదు కదా! పెద్దవాడు శ్రీనివాస్ ఫ్యాన్సీ కొట్టు పెట్టాడు. నాన్నగారి చావుతో పదివేలు వచ్చాయి. జీతం డబ్బులూ వచ్చాయి కదా! నేను అదే కంపెనీలో పనిచేస్తున్నానింకా ! ఏదో బొటా బొటి జీతం! ఎక్కడికి మాస్టారూ! జీవితం సాగనివ్వాలి అంతే!'

'విశ్వం కూడా ఫిలాసఫీ మాట్లాడుతున్నాడు' అనుకున్నాడాయన. 'ఎందుకు మాట్లాడడు? జీవితం ఒక పెద్ద పాఠశాల. ఊహూ విశ్వవిద్యాలయం. దాన్లో నేర్చుకోని పాఠం ఏముంది? అన్నీ అదే నేర్పుతుంది.... అయితే ఒకరకంగా రామారావు చావుతో ఆ కుటుంబ ఆర్థిక పరిస్థితులు ఒక కొలిక్కి వచ్చాయన్నమాట! పోనీ, అదీ ఒకందుకే కలిసొచ్చింది... హుం ఏం జీవితాలు... చావు పుట్టుకలతో కూడా లాభనష్టాలు వేసుకుంటున్నాం!"

"వస్తాను మాస్టారూ! బజార్లో పని చూసుకుని మళ్లీ యింటికి వస్తాను."

తలూపేడు సీతారామయ్య.

ఆయన ఆలోచనలు యింకా విశ్వం చుట్టూ తిరుగుతున్నాయి. ఆలోచనలు ఒక కేంద్రం చుట్టూ తిరగడం ప్రారంభిస్తే ఒక పట్టాన వదలి రావు కాబోలు - చెదిరితే తప్ప....

తనకి అయిదేళ్లనాడు హార్ట్ఎటాక్ వచ్చింది. ఇన్నేళ్ళ జీవితంలోనూ తను అనుభవించనిది అనారోగ్యం ఒక్కటే ! రక రకాల సుఖాలు అనుభవించలేదు తను. అయినా రకరకాల బాధలు అనుభవించాడు. అన్నిటికంటే లేమి, భార్యా వియోగం, అదే తనకి అప్పుడు గుండెపోటుని తెచ్చిపెట్టింది. తనకొక్కటే తృప్తి, తనది పరిపూర్ణమయిన ఆరోగ్యం....

భార్యవెంటే తనూ పోయివుంటే.... తన కొడుక్కి ఉద్యోగం వచ్చేది. తన కుటుంబానికీ ఓ యిరవై ముప్పై వేలు డబ్బు అందేది. ఇన్సూరెన్సూ వచ్చేది....ప్చ్... ఏం బ్రతుకు యిది....

తను యీ అయిదేళ్ల బ్రతుకుని పొడిగించుకుని సాధించిందేం ఉంది ! మరిన్ని బాధలని చూశాడు. ప్రభుత్వం పుణ్యమా అంటూ యీ మూడేళ్లూ ఉద్యోగం చేశాడు. మరికొంత జీవితాన్ని చూశాడు. అంతే కదా !

పచారికొట్టు జేరగానే ఆలోచనలు ఆగిపోయాయి.

జనార్ధన్‌కి డబ్బు యిచ్చాడు బిల్లు వెయ్యటానికి. పుస్తకమూ అందించాడు. అందులో సరుకుల పట్టీ ఉంది.

'కూర్చోండి. టీ తాగుతారా!' నవ్వుతూ పలకరించాడు. అతను తన ఫ్రెండ్ రంగనాయకులకి పరిచయం. అతను కొట్టు పెట్టినప్పటి నుంచీ తను అక్కడే కొంటున్నాడు. ఇరుకూ యిబ్బందులకి ఆదుకుంటాడని తనకి అతనిపై అభిమానం.. కానీ అతనికి విశ్వాసం వుంటుందా! తను అందర్లాటి కష్టమర్. అంతేనేమో!

కొట్లో రద్దీ లేదు. పట్టీ గుమాస్తా చేతికి అందించి ఫ్యాన్ వేసుకుని కబుర్లు మొదలు పెట్టాడు... ఫాన్ తిరుగుతోన్నా గాలి ఆట్టం లేదు సీతారామయ్యకి.

'ఈ నెలాఖరుకి రిటైర్ అవుతున్నానోయ్!' తన రిటైర్‌మెంట్ విషయం చెప్పాడు మాటల మధ్యలో సీతారామయ్య.

ఆ మాట వినగానే అతని ముఖంలో మార్పు వచ్చింది. కబుర్లు, ఆగేయి. అంతలో సరుకులు కట్టటం పూర్తయింది. పాకెట్స్ అన్నీ సంచుల్లో సర్దేడు.

పట్టీ చూశాడు జనార్ధన్. 'అబ్బో! ఇంకా రెండొందల పాతిక మిగిలిందే! కొంచెం మొత్తం తగ్గించండి సార్! ఒక్కో పద్దు మీద యిలా వందలొందలు పెంచెయ్యాలంటే మాకూ యిబ్బందే! పైగా సేల్స్‌టాక్స్, యిన్‌కమ్‌టాక్స్ లెక్కలు, ఆదాయం తక్కువైనా ఆ బాధలు మాత్రం తప్పవు. మేమేదో లోకాన్ని దోచుకుని తినిపోతున్నామని అందరికీ కుళ్లు. ఎవరి బాధలు వాళ్లవి. శ్రీ శ్రీ అన్నట్లు పీత బాధలు పీతవి.... మీరు రిటైర్ అయితే చాలా యిబ్బందే!.. పెద్ద సంసారం! ఎలా లాక్కొస్తారో... పాపం...'

సీతారామయ్య సమాధానం యివ్వలేదు. ఆయనకీ సానుభూతి వాక్యాలు కొత్త కాదు. ఇది దేనికీ 'ఇంట్రో'నో బాగా తెలుసు. అనుభవాలతో పండి పోయింది వయస్సు.

'ఏమో సార్! నేనూ యిక మెల్లిమెల్లిగా పద్దులు తగ్గించుకోవాలనుకుంటున్నాను.

ఎక్కడ సార్! ఒక్కసారి బాకీ పడితే అది ఎన్నేళ్లయినా తీరదు. గట్టిగా అడిగితే నిష్ఠూరం. పోట్లాట. డబ్బు యిచ్చి చెడ్డయ్యేవాడు ఒక సర్తకుడే సార్ లోకంలో."

సీతారామయ్య నవ్వేడు "జనార్దన్ ఆదాయం తగ్గితే అవసరాలూ తగ్గవు. అయినా తగ్గించుకోవాలి తప్పదు. అందని మాని కొమ్మలకి అర్రులు చాచకూడదు."

సరుకులు రిక్షాలో వేసుకుని బయల్దేరాడు ఆయన.

ఆయన మనస్సులో యింకా అతనిచ్చిన అల్టిమేటమ్ మెదలుతూనే ఉంది. తప్పదు. ఇలాటి షాకులకి తట్టుకోవాలి. ఎన్నెన్ని అనుభవాలు చవిచూశాడు తను, వాటిలో ఇదీ ఒకటి. మరణానికి మార్గం లేదు కానీ మహా విషానికి విరుగుడు వుంది.

దీనికో పరిష్కారం చూడాలి. అంతే!

రిక్షా యింటి ముందు ఆగేదాకా రకరకాలు ఆలోచనలు ! తెగిన గాలిపటం సుడిగాలిలో చిక్కుకున్నట్టుగా బాధల వడిలో పడ్డ మనస్సుకి ఒక గమ్యం ఉండదు. పరిపరివిధాల పరిగెడుతూ ఉంటుంది.

సరుకులతో యింట్లోకి వెళ్లేసరికి కొడుకులందరూ వచ్చారు. జీతాలందిన వాళ్లంతా తమ తమ జీతాలు పెద్ద కోడలు సీతకి యిచ్చారేమో! ఆమె 'బడ్జెట్' తయారు చేస్తోంది. ప్రభుత్వం యాడాదికి ఒకసారి బడ్జెట్ తయారుచేస్తే 'ప్లానింగ్' తెలిసిన మధ్యతరగతి కుటుంబాలు నెల నెలా బడ్జెట్ తయారు చేసుకోవాలి. జీతాలు నెల నెలా సరిగా వస్తాయే కానీ నెల నెలా పెరగవు. అది గొర్రెకు తోక బెత్తెడు అన్నట్లుగానే వుంటాయి. ఇంక్రిమెంటు పేరుతో ఏడాదికి పదో పదిహేనో పెరిగితే దానికంటే ముందు గానే ఇంటి అద్దె పెరిగి వుంటుంది. ప్రభుత్వం జీతాలు పెంచితే అని పేపర్లో ప్రకటించకముందే నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశంవైపు పరిగెడుతూ వుంటాయి. అందుకే నెలనెలా అవసరాల్లో 'కోత' విధించుకోవలసి వుంటుంది.

'వచ్చే నెల నుంచీ మామగారి జీతం రాదు! వెయ్యి రూపాయలు బడ్జెట్ కుదించాలి. జీతం ఎనిమిదొందలు తగ్గితే ఖర్చులు వెయ్యి తగ్గాలి.'

'ఖర్చులు తగ్గుతాయా?'

'ఎలాగో సర్దుకోవాలి!'

'ఎలా సర్దుకోవటం? ఏం సర్దుకోవటం?'

'నా దుంప తెగుతోంది. ఈ సంసారాన్ని లాక్కుని రాలేక. ఆరు సబ్బుల్ని మూడే చేస్తాను. చక్కెర తగ్గించేస్తాను కోటా. అందరికీ కాఫీ రెండో కోటా తగ్గిస్తాను. మామగారికి ఒక్కరికే సాయంకాలం టీ యిస్తాను. వారానికి ఒక సినిమా కాదు. నెలకి ఒక సినిమా! అంతే! సినిమాల కేమిటి! ఆరు థియేటర్లున్నారు. వారానికి ఒకటి కొత్తది – మంచిది వస్తోంది. ఎక్కడికి ఆశ. చూస్తూ వుంటే అన్నీబాగానే ఉంటాయి. నూనె అయిదు కేజీల నుంచి మూడు కేజీలకి తగ్గిస్తాను. ధర మండిపోతోంది' సీత ఆర్థిక మంత్రిణిగా అన్నిటికి కోత విధిస్తోంది.

ఉస్సురని నిట్టూర్చాడు సీతారామయ్య 'నిర్బంధ పొదుపు' అనుకున్నాడు.

కొడుకులు అంతా మౌనంగా వింటున్నారు. సీత ప్రత్యక్షంగా ఎవరితోనూ అనకపోయినా అందరికీ తెలుస్తోంది. కొడుకుల ముఖాలు చూస్తే ఆయనకి తండ్రి శవం చుట్టూ చేరి మౌనం పాటిస్తున్నట్టుగా అనిపించింది.

డబ్బు! డబ్బు!! డబ్బు!!!

దీనికెంత విలువ వుంది ?

ఈ కాయితాలకి యింత పవర్ ఎక్కడిది ?

ఈనాటి తనకీ, రేపు రిటైర్ అయ్యేక వుండే తనకీ శారీరకంగా, మానసికంగా ఏం మార్పు వుంటుంది! అప్పుడూ ఎప్పుడూ తను సీతారామయ్యే. కాకుంటే యిప్పుడు ఎసిస్టెంట్ హెడ్మాష్టర్... రేపు మామూలు నలుగురిలో ఒకడు....

అంతేనా?

ఊహూఁ తను గడనుడిగే మనిషి! నడుపీనుగుతో సమానం! తను నవ్వులపాలై బ్రతకగలగండా! మనిషికి 'రిటైర్‌మెంట్' తోనే చావు వస్తే ఎంత బావుంటుంది.

తన ఆలోచనకి తనే నవ్వుకున్నాడు. 'ఏప్పు!'

'అవును. ఇండియాలో సగటు ఆయుర్దాయం నలభయ్యయిదో ఆరో! తర్వాత జరిగేదంతా - ఆ బ్రతుకంతా బ్రాటోవరే! ఎందుకీ లాక్కెళ్లే జీవితాలు, బరువైన బ్రతుకులు అందరికీ బరువే............ఆఖరికి ఆ మనిషికి కూడా.......'

'నమస్కారం సార్!'

బిల బిలా వచ్చేశారు పది మంది అందరూ ఉద్యోగాలు, వ్యాపారాలూ, రాజకీయాలూ చేసుకుంటున్న వాళ్లు అందరూ వాసలపై కూర్చున్నారు. కూర్చోటానికి కుర్చీలేవి?ఇల్లా యిరుకే, వసతీ తక్కువే......

అతిథులు రావటంతో కొడుకులు, కోడళ్లు, మనవలు మనవరాళ్లు, 'లాస్ట్‌బెల్' విన్న పిల్లలాగా లోపలికి వెళ్లిపోయారు.

'మా యింట్లో కుర్చీలు లేవు. పేదవాడిని .....యింటికి వస్తే కాఫీ కూడా యివ్వలేని వాడిని..'

'నో........నో.......అలా అనకండి. అద్దె యిళ్లల్లో యింత కంటే సౌకర్యాలు ఏలా వస్తాయి. ఇపుడు మాకేం కొరవ. హాయిగా వాసలపై కూర్చున్నాం.'

అవును, అద్దె కొంపల్లో యింతకంటే సౌకర్యాలు ఎక్కడొస్తాయి! శరీరమే ఒక అద్దెకొంప జీవుడు దొరికిన 'కొంప'తో తృప్తిపడటం లేదే! జీవుడికి లేని తృప్తి మనిషికెక్కడిది!

'మాస్టారూ!'

'చెప్పండి బాబూ!'

'టీచర్స్‌డే సందర్భంగా మీకు సన్మానం ఏర్పాటు చేస్తున్నాం. మీ వంటి ఉత్తమ ఉపాధ్యాయుడుకి రాష్ట్రపతి అవార్డో పద్మశ్రీయో రావలసింది. ప్చ్! మేము పూర్వ విద్యార్థి

సంఘం, నగర యువజన సంఘం, ఉపాధ్యాయ సమితి, పౌరసమితి, పట్టణ ప్రజాభ్యుదయ సంఘం,రోటరీ క్లబ్, వేసిస్, లయన్స్ అంతా కలసి మీకు సన్మానం చేయాలనుకున్నాం, మీ రంగీకరిస్తే-'

సీతారామయ్య ముఖంలో కాంతి వెల్లి విరిసింది. తొలిసారి తృప్తి ముఖంలో తాండవ మాడింది. పెళ్లై భార్యయింటికి వచ్చిన రోజు, మొదటిసారి ఎటెండెన్స్ రిజిష్టర్‌లో సంతకం చేస్తున్నప్పుడు, తొలిసారి భార్య కడుపు పండి కొడుకుపుట్టినపుడు కలిగినంత ఆనందం కలిగింది.

వారి ఆత్మీయతని -అభిమానాన్ని కాదనలేక పోయాడు.

'అలాగే బాబూ! మీరంతా యింతగా అభిమానిస్తూ వుంటే ఎలా కదనగలను!'

'వాళ్లు సంతోషించారు.

'వెళతాం సార్!' అని సెలవు తీసుకున్నారు.

సీతారామయ్యకి జీవితం ఎంత చిత్రమైంది? అనిపించింది గంట క్రితం ఆలోచనలు! అరాటాలు!ఆవేదన! ఇప్పుడు ఆనందం.....

✧ ✧ ✧

టౌన్ హాల్లో ఏర్పాటు చేశారు సన్మానం.

సీతారామయ్య రిక్షాలోంచి గేటు ముందు దిగేసరికి ప్రముఖులు, పుర ప్రముఖులు అంతా గేటు వద్దే నుంచుని స్వాగతం పలికేరు. హెడ్‌మాష్టర్‌రు గారు మెడలో పూలమాల వేసి స్వాగతం పలికారు.

కొత్తగా ఏకగ్రీవంగా మునిసిపల్ ఛైయిర్మన్‌గా ఎన్నికయిన నాగభూషణం గారి వెంట నడుస్తోన్నాడు సీతారామయ్య. ఆయనే సభాధ్యక్షులు. దారి కిరువైపులా పూచిన మల్లెపొదల్లా, వికసించిన నేత్రాలతో, మనస్సు నిండా గౌరవం, చేతుల నిండాపూలతో నిలుచున్న విద్యార్థినులు సీతారామయ్య గారు నడుస్తోంటే గౌరవ పురస్కారంగా విరిజల్లులు కురిపించారు.

పుష్పాభిషేకం జరిగినట్లనిపించింది.

తన జన్మ ఫలించిందనుకున్నాడు ఆయన

కొత్తగా అలంకరించిన గోడలు, వాటికి లతల్లాగా. మణిదీపాల్లాగా ఏర్పాటు చేసి కలర్ బల్బ్స్, సరికొత్త మైక్స్, మోడరన్ సీటింగ్, వేదిక పైనా కిందా పరచిన రెడ్ బ్లూ కార్పెట్స్‌తో ఇంద్రసభా భవనం లాగావుంది హాలు.

ఆదర్శాలకి, ఉత్తమ శిక్షణకి, క్రమశిక్షణకి సుగుణాలకి జరుగుతోన్న సన్మానానికి సంతోషిస్తోన్నట్టుగా మెర్క్యురీలైట్లు మరింత తేజస్సుతోవెలుగుతోన్నాయి. ఫ్యాన్స్ తామూ సీతారామయ్యగారి 'ఫాన్స్' అన్నట్టుగా మెమ్మదిగా నిశ్శబ్దంగా తిరుగుతూ మంద మంద మలయానిలాల్ని వెదలజల్లుతోన్నాయి.

అంతటా పూలపరిమళం! ఎద పరిమళం.

ఆత్మీయతతో మంచి మనస్సులు వెదజల్లే మాటల సురభిళం.

స్థానిక శాసన సభ్యులు ముఖ్యఅతిథిగా విచ్చేశారు. మునిసిపల్ కమీషనర్ శ్రీ చందర్ సభా నిర్వహణ. నగరంలోని ఉపాధ్యా వర్గమంతా విచ్చేశారు. మచ్చ ఎరుగని జీవితంలో, అటు విద్యార్థి, ఇటు ఉపాధ్యాయ వర్గంలో పేరెన్నికగన్న సీతారామయ్య సన్మానసభ అంటే ఎవరు రారు! ప్రముఖులతో పుర ప్రముఖులతో సభ కిటకిటలాడుతోంది.

స్థానిక కాలేజీ ప్రిన్సిపాల్‌గారు సభ ప్రారంభించారు. ఎత్తయిన వేదిక మీద, రంగు రంగుల నియాన్ లైట్ల వెలుగుల సమ్మేళనం మధ్య నగర వెలుగుల వంటి ఆ పుర ప్రముఖుల మధ్యమాలలో కొలికి పూసలా వున్నారు సీతారామయ్య గారు.

'శిష్య వాత్సల్యమ్ము వెలుపు దీర్చిన మూర్తి, ఆదర్శఉపాధ్యాయుడు, ఉత్తము జీవనుడు, నిగర్వి, సచ్ఛీలి, జీవితంలో తృప్తి తప్ప అసంతృప్తి ఎరుగని మనిషి' అంటూ పొగిడారు తెలుగుశాఖ ప్రధానోపన్యాసకులు.

'ఇంతటి మంచి మనిషి, ఇంత గొప్ప ఉపాధ్యాయుడిని, మన మధ్య యిన్నాళ్లా వున్నా మనం గుర్తించలేదు. ఈనాడు ఆయనకి జరుగుతోన్న యీ సన్మానం ఉపాధ్యాయ వర్గానికే సన్మానం. ఆయన గుణగణాలకి తగినట్లుగా ఆయన్ని సత్కారించలేక పోయినా యథాశక్తి సన్మానిస్తున్నాం!' అన్నారు ఎమ్మెల్లేగారు.

తర్వాత ఎవరి శక్తి కొద్దీ వారు మాటలని పదపరిమళభరితంగా సభపై విరిజల్లారు. ఆఖర్న సీతారామయ్యగారిని నాగభూషణంగారు నిలువెత్తుగా మల్లెలతో, జాజులతో, గులాబీలతో, చేమంతులతో అందంగా అల్లిన పూమాలతో సత్కారించారు. మరువం, దవనం వెదజల్లుతోన్న సువాసనలు మీ సేవ మేం మరువం అంటున్నట్టుగా వున్నాయి.

శాలువా కప్పేరు... పర్స్ బహూకరించారు. శ్రీగంధం అలదేరు. పన్నీరు చిలికించేరు.

సీతారామయ్య మనస్సు నిండా, కళ్లనిండా తృప్తి. ఆయన కృతజ్ఞతలు చెప్పుకోడానికి లేచారు అరవై మంది విద్యార్థులున్న క్లాసులో పాఠాలు చెప్పారు. టీచర్స్ కాన్ఫరెన్స్‌లో, స్టాఫ్ మీటింగ్‌ల్లో మాట్లాడారు.

కానీ ఇంత పేరోలగంలో ఏనాడూ నోరు విప్పి ఎరుగడాయన.

'మహాశయులారా! మహనీయులారా!'

ఆయన గొంతుకలో గాద్గదికం! గుండె బరువెక్కింది ఆనందంతో... ఉద్వేగంతో బి.పి. హెచ్చినట్టుగా అయింది. అందర్నీ ఒకచోట చూసేసరికి కళ్లు బైర్లు కమ్మినట్లయింది.

"ఈరోజు నాకెంతో తృప్తిగా వుంది. నా వద్ద చదువుకున్న శ్రీధర్ స్టేట్ ఫస్ట్‌గా వచ్చిన రోజున యింతగా సంతోషించాను. మన పాఠశాల విద్యార్థి జయంతి కలెక్టరుగా వచ్చి నమస్కారించిన రోజున యిలా సంతోషించి, యింతగా ఆనందించాను. ఈరోజు నా పుట్టిన రోజు, ఒక ఉపాధ్యాయుడికి తన జన్మదినోత్సవం నాడు జరుగుతున్న సన్మానం. యింతకంటే యింకేం కావాలి.

నేను జీవిత కాలంలో ఏమీ మిగుల్చుకోలేదు. పన్నెండుగురు సంతానంతో – నన్ను

మనిషి హాలి... మా రోజుల్లో సంతానమే సౌభాగ్యం అనుకున్నాం.... ఆ రోజుల్లో కుటుంబ నియంత్రణ తెలియదు - లేదు. అధిక సంతానంతో నేను ఆర్థికంగా బాధలు పడినా అందుకే ఏనాడూ విచారించలేదు. నా బొటాబొటి జీతంలో ఏమీ మిగల్లేదు. తలదాచుకోను యిల్లు లేదు... అవసరం వస్తే బ్యాంకిలో ఏమీ మిగుల్చుకోలేదు - అయినా నాకు విచారమూ లేదు.

ఈ సన్మానం - ఈ గౌరవం - ఈ అభిమానం - ఆత్మీయత యివి చాలు నాకు. మనిషి కిలువెత్తు బంగారం, మణులు మాణిక్యాలు సంపాదించినా యీ తృప్తి దొరకదు... లభించదు....

ఈ ఆనందం నాకు పరిపూర్ణ తృప్తిని యిస్తోంది. నిరుద్యోగులైన కొడుకులున్నా నిరక్షరాస్యులు కానందుకు నాకు ఆనందంగా వుంది. ఒక పూట తింటేనేం తృప్తికి మించినదేం వుంది? ప్రాప్తమయిన లేశమైనా పదివేలు అనుకొనే మనస్తత్వం నాది.

నేనిలా సభల్లో ఏనాడూ మాట్లాడి ఎరుగను. ఈ సన్మానంతో నా మనస్సు నిండిపోయి ఏదేదో మాట్లాడాను. మీకు కృతజ్ఞతలు చెప్పటం కంటే యింకేం చెప్పలేను."

సీతారామయ్య కూర్చోగానే కరతాళధ్వనులు మిన్నుమిట్టాయి.

సభ ముగిసింది. ఛెయిర్మన్‌గారు సీతారామయ్యని కార్లో తెచ్చి యింటి వద్ద దిగబెట్టేరు. అది మరో గౌరవం అనిపించింది ఆయనకి.

'ధన్యోస్మి' అనుకున్నారు.

✧ ✧ ✧

అర్ధరాత్రి !

గాలిలో ఏదో ఆర్తనాదం వినిపించినట్లయింది. సీతారామయ్యగారి పెద్ద కొడుకు నారాయణ చప్పున లేచి కూర్చున్నాడు. దీపం వెలిగించాడు. మెలికలు తిరిగిపోతున్నాడు సీతారామయ్య.

'నాన్నా! నాన్నా!' ఆదుర్దాగా పిలిచాడు అతను. ఆ పిలుపుకి యింటిల్లిపాది మేల్కొన్నారు. తండ్రికి జరుగుతున్న అపూర్వ సన్మానానికి వచ్చిన ఆరుగురు కూతుళ్లు, అల్లుళ్లు, వాళ్ల పిల్లలు, ముగ్గురు కోడళ్లు, కొడుకులు, మనవలు, మనవరాళ్లు, అంతా క్షణంలో ఆయన చుట్టూ చేరారు.

అయిదేళ్లనాటి గుండెపోటు మళ్లీ వచ్చింది. ఆయనకి ఊపిరి అందటం లేదు, యమయాతన పడుతున్నారు. అందరూ గాబరా పడుతున్నారు. అందరి ముఖాల్లోనూ ఆందోళన.

'బాబూ!' ఆయాసంగా పిలిచారాయన.

'నాన్నా!' ఆరు స్వరాలా ఒక్కసారిగా విషాదాన్ని పలికేయి.

నా పని అయిపోయింది. నాకు తృప్తిగా వుంది. అందర్నీ ఒక్కసారి చూస్తున్నాను.

నాకేం కొరత వుందని.... ఒక ఆర్థిక బాధ తప్పితే మనమే విషయానికి బాధపళ్లేదు. ఉమ్మడి కుటుంబం అసంతృప్తి, సమస్యలు మనం ఎరగం'. ఆయాసంతో ఒక్క క్షణం ఆగి మళ్లీ అన్నారాయన.

'ఇప్పుడు అదీ తీరుతోంది!' విశ్వం ఆయన మనస్సులో మెదిలాడు రాము కళ్లకి కనిపించాడు. "నేను చనిపోతే ప్రభుత్వం పదివేలు ఇస్తుంది. ఇరవై నెల్ల జీతం వస్తుంది. బి.ఏ; బి.ఇడి. చదివిన సూర్యానికి ఉద్యోగం యిస్తుంది. నా పి.యఫ్. వస్తుంది. ఇన్సూరెన్సు పదివేలు వస్తాయి'.

'నాన్నా!' కొడుకులు వారించబోయారు.

'నా పిల్లలకి చదువులు చెప్పించాను. చేతనయిన ఉద్యోగాలు వేయించాను, అందరమూ అందలాలెక్కలేం కదా! అయినా ప్రభుత్వ ఉద్యోగాలతో ఏం మిగల్చగలం? తృప్తి తప్ప! ఇప్పుడు యీ సౌకర్యాలన్నీ నేను సంపాదించినట్టే కదా! ఇదే నే మిగిల్చిపోతున్న ఆస్తి!'

ఆయనకి ఆయాసం ఎక్కువైంది. చూపులో మార్పు వస్తోంది.

తర్వాత ఆయన నోట మాట రాలేదు.

మాటలని కూడదీసుకుని అన్నారు 'కలసి బ్రతకండి! సుఖంగా కలిగిన దాంతో తృప్తిగా జీవించండి.'

ఆయన కళ్లు బరువుగా మూసుకపోయాయి.

అందరూ గొల్లుమన్నారు.

సీతారామయ్యగారి ఆత్మ తృప్తిగా మరో లోకాలకేసి పయనిస్తోంది....

● ఆంధ్రసచిత్రవారపత్రిక 30-4-82 ●